కార్డుదారులు సంతృప్తి వ్యక్తం చేశారు



గతంలో ఎండీయూ వాహనాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే అందేవి. ఇప్పుడు బియ్యంతో పాటు జొన్నలు, చక్కెర కూడా ఇస్తుండడంతో కార్డుదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సర్వర్ ప్రాబ్లం ఉన్నప్పటికి తొలిరోజున 150 కార్డుదారులకు బియ్యం, సరుకులు పంపిణీ చేశాం. గడువులోగా మిగిలిన వారికీ బియ్యం, సరుకులు పంపిణీ చేస్తాం.

- డీలర్ భవాని, డీలర్ల సంఘ కార్యదర్శి

వీధుల్లో రేషన్‌కు స్వస్తి

- దుకాణాల్లోనే నిత్యావసరాల పంపిణీ
- అట్టహాసంగా ప్రారంభం

(కడప-ఆంధ్రజ్యోతి): చౌక దుకాణాల ద్వారా ఎన్నో ఏళ్లుగా పేదలకు నిత్యావసర వస్తువులు బియ్యం, చక్కెర, కందిబేడలు అందిస్తూ వస్తున్నారు. అయితే జగన్ ప్రభుత్వం ఇంటింటికీ రేషన్ సరుకులు పంపిణీ అంటూ ఎండీయూ (మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) వ్యవస్థను తీసుకువచ్చి డీలరు వ్యవస్థను నిర్వీర్యం చేసింది. డోర్ డెలివరీ అంటూ ఎన్నికలప్పుడు హామీ ఇచ్చి రేషన్ కోసం జనాన్ని వీధుల్లో నిల్చునేలా చేసింది. ఎప్పుడోసారి ఆ బండి ఆ ప్రాంతానికి వస్తే అప్పుడు సరుకులు తీసుకోవాల్సిన పరిస్థితి. ఇది కూలీ నాలీ చేసుకునే పేదలు, దివ్యాంగులు, వృద్ధులకు చాలా ఇబ్బందిగా ఉండేది. జిల్లాలో కూడా సుమారు 350 వాహనాల ద్వారా పంపిణీ జరుగుతూ వచ్చేది. వాహనం వచ్చిన రోజు ఇంటిదగ్గర లేకపోతే ఇక సరుకులు అంతే. దీంతో కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. చంద్రబాబునాయుడు నేతృత్వంలో ప్రభుత్వం మళ్లీ పాత విధానాన్ని తీసుకువచ్చింది. రేషన్ షాపుల కోసం వీధుల్లో నిలబడకుండా చౌక దుకాణాల్లోనే ఇచ్చేలా ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా అట్టహాసంగా రెవెన్యూ అధికారులు చౌక దుకాణాలు ప్రారంభించారు. పలువురు అధికార పార్టీ నాయకులూ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

జిల్లాలో 5.86 లక్షల రేషను కార్డులున్నాయి. 1724 చౌక దుకాణాలున్నాయి. దుకాణాల్లో ప్రతిరోజూ ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు తిరిగి సాయంత్రం 4 నుంచి 8 వరకు రేషన్ సరుకులు ఇస్తారు. ఇక 65 ఏళ్ల పైబడ్డ వృద్ధులు, దివ్యాంగులకు 5వతేదీ లోపే డీలర్లు నేరుగా ఇంటికెళ్లి సరుకులు అందిస్తారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎండీయూ వాహనాలు వచ్చాక రేషన్ మాఫియా పెరిగింది. కొన్ని వాహనాల నుంచే బియ్యాన్ని నేరుగా బ్లాక్‌మార్కెట్‌కు తరలించారనే ఆరోపణలున్నాయి. బియ్యం వద్దనుకున్న కార్డుదారులకు కిలోకు రూ.10 వంతున డబ్బులు ఇచ్చేసి వాటని బ్లాక్ మార్కెట్ కు తరలించేవారు. ఓ విధంగా చెప్పాలంటే ఎండీయూ వెహికల్స్ బియ్యం మాఫియాకు తొలిమెట్టు అంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ డీలర్ల వ్యవస్థ తీసుకురావడంతో పాటు బియ్యం పక్కదారి పట్టకుండా ఉండడానికి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది.



జమ్మలమడుగులోని ఓ రేషన్ షాపులో లబ్ధిదారులకు సరుకులు అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, ఆర్డీవో సాయిశ్రీ

పేదలకు ఎంతో మేలు

కూలీ నాలీ పనులు చేసుకునే పేదలు ఎప్పుడు అవకాశం ఉంటే అప్పుడు రేషను షాపునకు వెళ్లి నిత్యావసర వస్తువులు తెచ్చుకుంటారు. అయితే ఎండీయూ వాహనాల కోసం పనిమానుకుని వేచి ఉండాల్సిన పరిస్థితి దాపురించేది. ఒకరోజు మిస్ అయితే ఆ బండి కోసం వీధుల్లో కాపు కాయాల్సిన పరిస్థితి ఉండేది. ఇక నుంచి ఆ నిరీక్షణ ఉండదు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఎప్పుడైనా రేషన్ దుకాణం వద్దకు వెళ్లి తెచ్చుకోవచ్చు. ఇక వృద్ధులు, దివ్యాంగుల ఇంటివద్దకే వెళ్లి ప్రతి నెలా 5వతేదీలోపు నేరుగా డీలర్లే రేషన్ అందించనున్నారు.

రేషన్ బియ్యానికి ఢోకాలేదు



డీలరు షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేయడం వల్ల మాకు వచ్చే బియ్యం, చక్కెర ఇతర నిత్యావసర వస్తువులకు ఢోకాలేదు. నెలలో 15 రోజుల పాటు ఉదయం, సాయంత్రం రెండుపూటలా షాపులు తెరిచి ఉంటాయి. దీని వల్ల వీలున్నప్పుడు పోయి తీసుకోవచ్చు. ఇది మంచి నిర్ణయం

- కాటం వీరకుమారి, వినాయకనగర్ ప్రొద్దుటూరు

ఎదురుచూపులకు కాలం చెల్లింది



గత ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఉండేది. ఎప్పుడు వాహనాలు వస్తాయా అని చూడాల్సి వచ్చేది. ఇప్పుడు మళ్లీ చౌక దుకాణాలు ప్రారంభం కావడంతో ఎదురుచూపులకు కాలం చెల్లింది. ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది.

- ఆర్.గంగాధర్, రామేశ్వరం, సోములవారిపల్లె, ప్రొద్దుటూరు

చంద్రబాబుకు రుణపడి ఉంటాం



మళ్లీ రేషన్‌షాపులను తీసుకువ వచ్చినా.. 65 ఏళ్ల నిండిన వృద్ధులు, వికలాంగులకు నేరుగా ఇంటికే రేషన్ తీసుకువచ్చి అందించమని చెప్పడంతో మాలాంటి వారికి ఇబ్బంది లేకుండా ఉంటుంది. చంద్రబాబునాయుడుకు రుణపడి ఉంటాం.

- లక్ష్మిరాజ్యం, రామాలయం వీధి, మైదుకూరు


అక్రమ రవాణాకు బ్రేక్



డోర్ డెలివరీ ముసుగులో గత వైసీపీ పాలనలో యథేచ్ఛగా సాగించిన బియ్యం అక్రమరవాణాకు ప్రస్తుతం బ్రేక్ పడినట్లయింది. ఇంటింటికీ వాహనాల ద్వారా సరకులు పంపిణీ చేస్తామని చెప్పిన వైసీపీ నాయకులు అదే వాహనాల్లో బియ్యాన్ని అక్రమ రవాణా చేశారు. ప్రస్తుతం వాహనాలను ఆపేయడంతో అక్రమరవాణాకు అడ్డుకట్ట పడింది.

- కె.మహేశ్వరి, అలంఖాన్‌పల్లెకాలనీ

యోగాతో ఆరోగ్య భాగ్యం



ఫ్యామిలీ యోగాలో భాగంగా వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో యోగా చేస్తున్న, అధికారులు, ప్రజలు



యోగా చేస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప మారుతీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మన దినచర్యలో యోగా ఒక భాగంగా మారితే ఇంటిల్లిపాదికి ఆనందం, ఆరోగ్యభాగ్యం సొంతం అవుతుందని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం కడప వైఎస్ రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో కడప నగరపాలక సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యామిలీ యోగా కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సుమారు వెయ్యి కుటుంబాలకు చెందిన 4365 మంది పాల్గొన్నారు. వీరికి మాస్టర్ ట్రైనర్లు యోగాసనాలపై అవగాహన, శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఫ్యామిలీ యోగా కార్యక్రమానికి ఒక్కో కుటుంబానికి చెందిన పిల్లలు, తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ హాజరై యోగాసనాలు వేయడం గర్వించదగ్గ విషయమన్నారు. యోగసాధనతో మానసిక సమస్యలు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగాని నిత్య జీవితంలో భాగం చేసుకోవాలన్నారు. కడప నగరంలో ఫ్యామిలీ యోగా కాన్సెప్ట్‌తో నిర్వహించిన కార్యక్రమం నగర ప్రజల్లో నూతనోత్సాహం నింపిందన్నారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారితో యోగా ట్రైనర్లు యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్‌కుమార్‌రెడ్డి, కడప ఆర్డీవో జాన్ ఇర్విన్, జిల్లా పర్యాటక అధికారి సురేశ్‌కుమార్, స్టెప్ సీఈవో సాయిగ్రేస్, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ రాజ్యలక్ష్మి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రంగస్వామి, డీఎంహెచ్‌వో నాగరాజు, డీఎస్‌డీవో జగన్నాథరెడ్డి, ఆయుష్ నోడల్ అధికారి డాక్టర్ మురళి తదితర జిల్లా అధికారులు, పలువురు ఉద్యోగులు, ఎన్జీవో ప్రతినిధులు, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నేడు జడ్పీలో బదిలీలు?

కడప రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జడ్పీలో బదిలీలకు వేళయింది. ఉమ్మడి కడప జిల్లాలోని జిల్లా ప్రజాపరిషత్ శాఖలో 2025కు గాను సోమవారం ఉద్యోగుల బదిలీలు చేపట్టనున్నారు. బదిలీ అయ్యే ఉద్యోగులకు జడ్పీ చైర్మన్ రామగోవింద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కౌన్సెలింగ్ నిర్వహించేందుకు జడ్పీ సీఈవో సి.ఓబులమ్మ చర్యలు చేపట్టారు. జడ్పీ పాలకమండలి వైసీపీ ఆధీనంలో ఉండడంతో బదిలీలను తమకు అనుకూలంగా సాగించేందుకు పట్టు బిగించారని సమాచారం. కాగా.. 2014-19 టీడీపీ పాలనలో జడ్పీ పాలకమండలి వైసీపీ ఆధీనంలో ఉన్నప్పటికీ నాటి జీవో ప్రకారం అప్పటి జాయింట్ కలెక్టర్, ఇన్‌చార్జ్ సీఈవోగా జడ్పీ చైర్మన్ ప్రమేయం లేకుండానే బదిలీలు నిర్వహించారు. ప్రస్తుత టీడీపీ కూటమి పాలనలోని జడ్పీ సీఈవో మాత్రం జడ్పీ బదిలీలను చైర్మన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తుండడం చర్చనీయాంశంగా మారింది.

జడ్పీలో వైసీపీ నేతల అండ ఉన్న పలువురు ఉద్యోగులు, సిబ్బంది 5 ఏళ్ల పైబడి తిష్టవేసి ఒకేచోట పనిచేస్తున్నవారు పదుల సంఖ్యలో ఉన్నారు. వీరిని ప్రస్తుత బదిలీల్లో కూడా కదిలించవద్దంటూ అధికారులపై తీవ్ర వత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. జడ్పీ శాఖలోని ఆయా విభాగాలలో ఐదేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు 164 మంది ఉన్నారు. కానీ వీరిలో బదిలీలకు 72 మందే దరఖాస్తు చేసుకున్నారు. మిగిలిన 92 మందిని బదిలీ జాబితా నుంచి సడలింపు చేసే ప్రయత్నం జరుగుతున్నట్లు సమాచారం. కాగా.. కొంతమంది నేతలు, ఉద్యోగ సంఘాలు సమయం పొడిగించాలని చేసిన అభ్యర్థన మేరకు జూన్ 9 వరకు బదిలీల సమయాన్ని పొడిగిస్తున్నట్లు ఆదివారం ప్రభుత్వం పేర్కొంది. ఈ నేపథ్యంలో సోమవారం జడ్పీలో బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందా లేదా అనే విషయంలో సందిగ్ధత ఏర్పడింది. దీనిపై జడ్పీ సీఈవో ఓబులమ్మను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా.. బదిలీల గడువు పెంచినట్టు తమకు ఎలాంటి ఉత్తర్వులు అందలేదని, దీంతో సోమవారం బదిలీల కౌన్సెలింగ్ ఉంటుందని అన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలల మధ్య పోస్టుల బదిలీ

- బోధన, బోధనేతర పోస్టుల సర్దుబాటు

కలికిరి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల మధ్య పోస్టులను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఫలితంగా కడప, అన్నమయ్య జిల్లాల్లోని వివిధ పాలిటెక్నిక్ కళాశాలల నుంచి మొత్తం 15 పోస్టులు ఇతర ప్రాంతాల కళాశాలలకు బదిలీ కాగా నాలుగు పోస్టులు మాత్రం ఇతర ప్రాంతాల నుంచి ఈ రెండు జిల్లాలకు బదిలీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యార్థుల సంఖ్య, అవసరాలు తదితర అంశాలు పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం 109 బోధన, 201 బోధనేతర పోస్టులను పరస్పరం బదిలీ చేసింది. దీని ప్రకారం పీలేరిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నుంచి సింహాద్రిపురం కళాశాలకు టెక్స్‌టైల్స్ టెక్నాలజీ సీనియర్ లెక్చరర్ పోస్టును బదిలీ చేశారు. అదే విధంగా హిందూపురం కళాశాల నుంచి కడప మహిళా పాలిటెక్నిక్‌కు కెమిస్ట్రీ లెక్చరర్ పోస్టును, మడకశిర నుంచి వేంపల్లె కళాశాలకు ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులను బదిలీ చేశారు. ఇక కడప, అన్నమయ్య జిల్లాల్లోని కడప మహిళా పాలిటెక్నిక్ నుంచి ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పోస్టును తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు, మదనపల్లె పాలిటెక్నిక్ నుంచి ప్రొద్దుటూరు కళాశాలకు మరో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ పోస్టును బదిలీ చేశారు. మదనపల్లె కళాశాల నుంచి కంప్యూటర్ ఇంజినీరింగ్ లెక్చరర్ పోస్టును కల్యాణదుర్గం కళాశాలకు, మదనపల్లె నుంచే ఫిజికల్ డైరెక్టర్ పోస్టును గుంటూరు మైనారిటీస్ పాలిటెక్నిక్‌కు, కలికిరి పాలిటెక్నిక్ నుంచి తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్‌కు కెమిస్ట్రీ పోస్టును, రాజంపేట కళాశాల నుంచి వేంపల్లె, కమలాపురం పాలిటెక్నిక్ నుంచి సింహాద్రిపురం కళాశాలలకు ఫిజిక్స్ లెక్చరర్ పోస్టులు బదిలీ అయ్యాయి. ఇక జమ్మలమడుగు కళాశాల నుంచి ఇంగ్లీషు లెక్చరర్ పోస్టును కడప మహిళా డిగ్రీ కళాశాలకు బదిలీ చేశారు. రాయచోటి కళాశాల నుంచి కూడా ఇంగ్లీషు లెక్చరర్ పోస్టును ప్రొద్దుటూరుకు బదిలీ చేశారు. ఇక బోధనేతర సిబ్బంది పోస్టుల్లోనూ కొందరిని వైఎస్ఆర్ కడప, అన్నమయ్య జిల్లాల నుంచి ఇతర జిల్లాలకు, అక్కడి వారిని కడప, అన్నమయ్య జిల్లాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్, శిక్షణ శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు

కులగణనతోనే సాధ్యం

- బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు చిరంజీవులు



మాట్లాడుతున్న బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు

ప్రొద్దుటూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కులగణనతోనే బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధ్యమని బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు పేర్కొన్నారు. ఆదివారం ఆయన స్థానిక ఎస్కే గ్రాండ్‌లో విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీలు, మున్సిపాలిటీలలో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లను ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ప్రభుత్వం అమలుచేయాలని డిమాండ్ చేశారు. కులగణన జరపకుండా బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు ఏ నివేదికల ఆధారంగా అమలు చేయగలరో తెలపాలన్నారు. వాస్తవానికి బీసీల కులగణనను ఏడాదిలోపు కేంద్రం పూర్తిచేసేలా రాష్ట్రప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి పెంచాలన్నారు. కులగణన పూర్తి అయితే బీసీలకు జనాభా దామాషా ప్రకారం 50 శాతం పైగానే విద్య ఉద్యోగాలతో పాటు రాజకీయాల్లో రిజర్వేషన్లు సాధ్యమౌతాయన్నారు. జనగణనతో పాటు వెంటనే కులగణన ప్రారంభించి ఏడాదిలో పూర్తి చేయాలన్నారు. గతంలో కేంద్రం చేపట్టిన సోషియో ఎకనామిక్ సర్వేను సైతం కేంద్రం బహిర్గతం చేయాలన్నారు. బీసీలకు న్యాయం జరగాలంటే సామాజిక సమానత్వం సాకారం కావాలంటే కులగణనతోనే సాధ్యమౌతుందన్నారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం పార్లమెంటు అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు, ప్రతాప్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫిర్యాదుల స్వీకరణ

కడప కలెక్టరేట్, జూన్1 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వరనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఉదయం 9-30 గంటల నుంచి 30 నిమిషాల పాటు డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం జరుగుతుందని, బాధితులు సమస్యల పరిష్కారానికి 08562-244437 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తమ సమస్యలపై అధికారులకు ఇచ్చిన ఫిర్యాదుల పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 1100 నెంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

అల్లుడిని దారుణంగా హత్య చేసిన మామ

- భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణమా ?



7

అనుమానం పెనుభూతమై..

భార్యను చంపి ఆత్మహత్య చేసుకున్న భర్త



వల్లెపు నిత్యానంద్, వల్లెపు లక్ష్మికుమారి మృతదేహాలు

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనుమానం పెనుభూతమై.. కట్టుకున్న భార్యను కడతేర్చడమే కాక.. తానూ ఉరేసుకుని చనిపోయాడు. ఇద్దరు చిన్నారులను, నడవలేని తల్లిని అనాథలను చేశాడు. ఈ విషాద సంఘటన చెన్నూరులో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..

చెన్నూరు ఆర్సీయం చర్చి సమీపంలోని కుమ్మరివీధికి చెందిన వల్లెపు నిత్యానంద్ (37)కు ఖాజీపేట మండలం నాగసానిపల్లె పంచాయతీ పరిధిలోని లక్ష్మింపల్లెకు చెందిన లక్ష్మికుమారి(29)తో పదేళ్లక్రితం వివాహం జరిగింది. పెళ్లయినప్పటి నుంచి వీరు ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. వీరికి గంగ మేఘన (8), గంగ మౌనిక (5) కుమార్తెలు. ఇతను ఆటో తోలుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. నిత్యానంద్ తల్లి లక్షుమ్మ చాలాకాలంగా అనారోగ్యంతో మంచంపైనే ఉన్నారు. ఈ నేపథ్యంలో పిల్లలకు మంచి భవిష్యత్తు ఉండాలనే ఆలోచనతో నిత్యానంద్ గతంలో ఒకసారి కువైట్ వెళ్లి ఏడాదిన్నర పాటు ఉండి తిరిగి వచ్చాడు. ఆర్నెళ్లు ఆటో తోలాడు. తిరిగి ఏడాదిన్నర క్రితం కువైట్ వెళ్లాడు. 11 రోజుల క్రితం ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంటికి వచ్చిన రోజునుంచీ భార్యతో, పిల్లలతో చాలా ప్రేమగా ఉన్నాడు. పిల్లలు ఏమడిగినా తీసిస్తూ వచ్చాడు. అయితే ఇతనికి భార్యపై అనుమానం పెరిగింది. దీంతో నాలుగురోజుల నుంచి భార్యాభర్తలు గొడవ పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజామున 3గంటల సమయంలో బయట వరండాలో నిద్రిస్తున్న భార్యను లోపలికి తీసుకెళ్లాడు. లోపలి నుంచి కేకలు వినిపించాయి. దీంతో బయట నిద్రపోతున్న ఇద్దరు కుమార్తెలు మేలుకుని అమ్మ ఏడుపు విని లోపలికి వెళ్లి చూడగా తండ్రి నిత్యానంద్ వారిని బయటికి తోసి తలుపు గడియపెట్టాడు. అదే సమయంలో మంచంలో నిద్రపోతున్న అతని తల్లి లక్షుమ్మ కుమారుడిని వారించాలని ప్రయత్నించినా అతను వినలేదు. కొడుకును గట్టిగా అరుస్తూ కోడలిని ఏమీ చేయవద్దని తల్లిచెబుతున్నా.. మరోవైపు బిడ్డలు ఏడుస్తున్నా.. నిత్యానంద్ పట్టించుకోకుండా భార్య మెడకు చున్నీ బిగించి కొక్కికి ఉరివేసి చంపేశాడు. ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్న తర్వాత ఇంట్లోనే శవాన్ని పడుకోబెట్టాడు. తెల్లారితే ఎలాంటి సమస్య వస్తుందో ఏమో అనే భయంతో లోపలే ఉన్న బాత్‌రూంలో ఉరి వేసుకున్నాడు. వీరి కేకలు విన్న చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకున్నారు. అయితే ఎవ్వరూ తలుపు తీసే సాహసం చేయలేదు.



తల్లిదండ్రుల మరణంతో అనాథలుగా మిగిలిన ఇద్దరు కుమార్తెలు

తెల్లవారినా నిత్యానంద్ తలుపు తీయకపోవడంతో అనుమానం వచ్చి పోలీసులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న సీఐ కృష్ణారెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే స్థానికులు తలుపులు పగలకొట్టారు. బాత్‌రూమ్‌లో ఉరి వేసుకున్న నిత్యానంద్, గదిలో ఉన్న లక్ష్మీకుమారి మృతదేహాలను పోలీసులు పరిశీలించారు. లక్ష్మీకుమారి అన్న వెంకటరమణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను శవపరీక్ష నిమిత్తం కడప రిమ్స్‌కు తరలించారు.

అనుమానంతో అటు భార్యను కడతేర్చి ఇటు తాను ఉరి వేసుకుని చనిపోవడంతో ఆ కుటుంబంలో నడవలేని ముసలి తల్లి, ఇద్దరు చిన్నారులు అనాథలుగా మిగిలిపోయారు. వృద్ధురాలైన తల్లిని, దిక్కుతోచని స్థితిలో బిక్కుబిక్కుమంటూ చూస్తున్న చిన్నారులను ఆదుకునేదెవరు? వారి జీవితానికి భరోసా ఎవరని కాలనీవాసులు కంట తడిపెట్టారు.

అడ్డగోలుగా వెంచర్లు

● పంచాయతీల ఆదాయానికి గండి ● అనుమతుల మంజూరులో అధికారుల చేతివాటం



వెల్లటూరు గ్రామ పరిధిలో వేసిన వెంచర్

పెండ్లిమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానికి అనుగుణంగా గ్రామాల్లో కూడా ప్రజలు కొత్తదనాన్ని కోరుకుంటూ సకల వసతులతో గృహాలు నిర్మించుకుంటున్నారు. అలాగే పట్టణాలకు దూరంగా ప్రశాంత వాతావరణంలో పల్లెల్లో నివాసాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మండల పరిధిలోని కడప-పులి వెందుల ప్రధాన రహదారి వెంబడి పుట్టగొడుగుల్లా లేఔట్లు పుట్టుకొస్తున్నాయి. నిన్నటి దాకా పంట పొలాలతో కళకళలాడిన భూములు ఇప్పుడు వెంచర్లుగా మారి సరిహద్దులు రంగురాళ్లతో దర్శనమిస్తున్నాయి. మండలంలోని కడప-పులివెందుల ప్రధాన రహదారి వెంబడి నివాస ప్రాంతాల ధరలు విపరీతంగా పెరిగాయి. ప్రాంతాన్ని బట్టి కనీసం సెంటు రూ.3లక్షల నుంచి గరిష్ఠంగా రూ.10లక్షల వరకు ధర పలుకుతోంది.

పంచాయతీల అనుమతి తప్పనిసరి

మండల పరిధిలో ఎక్కడైనా ఒక లేఔట్ వేయాలంటే గ్రామపంచాయతీ అనుమతి తప్పని సరిగా తీసుకోవాలి. రంపతాడు, మొయిళ్లకాల్వ, తిప్పిరెడ్డిపల్లె, వెల్లటూరు, పాతసంగటిపల్లె, నందిమండలం, పెండ్లిమర్రి గ్రామాల పరిధిలో ఎక్కువగా లేఔట్లు వెలిశాయి. దాదాపు మూడు వందల ఎకరాల్లో వెంచర్లు వేశారు. నిబంధనల ప్రకారం లేఔట్లో రోడ్లు, అంతర్గత రహదారులు, విద్యుత్, గ్రీనరీ, కమ్యూనిటీ హాలు, ప్రార్థన మందిరాలకు స్థలాలు కేటాయించాలి. వీటన్నింటికి పంచాయతీ తీర్మానం అవసరం. వీటన్నింటికి కలిపి పంచాయతీకి డబ్బులు చెల్లించాలి. వాటి ద్వారా వచ్చిన నిధులను గ్రామ పంచాయతీలలో మౌలిక వసతుల కల్పనకు వినియోగించుకోవాలి. అయితే ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే రియల్టర్లు పంచాయతీలకు చెల్లించాల్సిన డబ్బులు ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు చెల్లిస్తున్నారు. ఆ కార్యదర్శులకు డబ్బులే కాక వెంచర్లలో ప్లాట్లను బహుమతులుగా పొందుతున్నారు. ఏ పంచాయతీలో కూడా ఈ నిధులను ఖర్చు చేసిన పాపాన పోలేదు.

అధికారుల చేతివాటం

మండలాల్లో లేఔట్లు వేయాలంటే పంచాయతీ తీర్మానాలతో పాటు, రెవెన్యూ అధికారుల అనుమతులు తప్పనిసరిగా ఉండాలి. వ్యవసాయ భూములు కావడంతో ముందుగా ల్యాండ్ కన్వర్షన్ చేయించుకోవాలి. కడప నగరం దినదినాభివృద్ధి చెందడంతో నగరానికి చుట్టుపక్కల ఉన్న మండలాల్లో భూములకు విలువ అమాంతం పెరిగింది. దీంతో మండ లంలో ఎక్కడ పడితే అక్కడ ఇష్టాను సారంగా అనుమతులు, ల్యాండ్ కన్వర్షన్ లేకుండానే ఇబ్బడిముబ్బడిగా రియల్టర్లు అధికారులను మేనేజ్ చేసి వెంచర్లు వేసారు. అనుమతులు లేని ప్లాట్లను కొనుగోలు చేసి జనం మోసపోతున్నారు. వెల్లటూరు పంచాయతీలోనే రూ.10,57,827లు దుర్వినియోగం జరిగినట్లు విజిలెన్స్ విచారణలో తేలింది. ఇక అనధికారికంగా దాదాపు రూ.65లక్షల వరకు స్వాహా చేసినట్లు సమాచారం. ఇక రంపతాడు, మొయిళ్లకాల్వ గ్రామ పంచాయతీలలో ఈ లేఔట్ల ద్వారా వచ్చిన నిధులు పెద్ద ఎత్తున దుర్వినియోగం జరిగినట్లు సమాచారం. ఈ పంచాయతీ నిధుల గోల్‌మాల్ విషయమై ఎంపీడీవోను వివరణ కోరగా.. అది ఈఓపీ ఆర్‌డీ పరిధిలో ఉంటుందన్నారు. ఇక మండలానికి రెగ్యులర్ ఈఓపీఆర్‌డీ లేకపోవడంతో ఇన్‌చార్జ్‌ను వివరణ అడగ్గా సమాచార హక్కు చట్టం ద్వారా అయితేనే వివరాలు చెబుతాం అని తెలిపారు. ఈ లేఔట్లు ఉన్న గ్రామ పంచాయతీలలో విచారణ జరిపితే భారీ అక్రమాలు బయట పడుతాయని స్థానికులు చెబుతున్నారు.

నెల్లూరు, కడప జట్ల విజయం



మన్విత్‌రెడ్డి, నెల్లూరు 109 పరుగులు



వాసుదేవరాజు (కడప) 99 పరుగులు

కడప స్పోర్ట్స్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్ 23 మెన్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భాగంగా ఆదివారం వివిధ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లలో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో, కడప జట్టు 21 రన్స్ తేడాతో ప్రత్యర్థి జట్లపై విజయం సాధించాయి. వివరాలిలా..

కేఎస్‌ఆర్‌ఎం మైదానంలో అనంతపురం - నెల్లూరు జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. టాస్ నెగ్గిన అనంతపురం జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 49 ఓవర్లలో 230 పరు గులకు ఆలౌట్ అయింది. ఇందులో వీరారెడ్డి 47 పరుగులు, వికాస్ 42 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ దిగిన నెల్లూరు జట్టు 36.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 235 పరుగులు చేసి విజయం సాధించింది. ఇందులో మన్విత్‌రెడ్డి 109 పరుగులు చేయడం విశేషం. దీంతో నెల్లూరు జట్టు 3 వికెట్ల తేడాతో విజయభేరి మోగించినట్లయింది.

వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో కడప-కర్నూలు జట్ల మధ్య మరో మ్యాచ్ జరిగింది. ఇందులో టాస్‌నెగ్గిన కడప జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని 45 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 236 పరుగులు సాధించింది. ఇందులో వాసుదేవరాజు 99 పరుగులు సాధించి. ఒక్క పరుగు తేడాతో సెంచరీ మిస్ అయ్యాడు. మరో బ్యాట్స్‌మెన్ విజయరామిరెడ్డి 61 పరుగులు సాధించి భారీ స్కోరుకు బాటలు వేశారు. ఇక బౌలింగ్ విభాగంలో కర్నూలు జట్టు బౌలరు సాబ్‌జాన్‌బాషా ఐదు వికెట్లు పడగొట్టడం విశేషం. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 45 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 215 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైంది. ఇందులో తౌఫిక్‌హుసేన్ 41 పరుగులు, మనోజ్‌రాజ్ 66 పరు గులు చేశారు. దీంతో కడప జట్టు 21 రన్స్ తేడాతో విజయభేరి మోగించింది.

గుర్తు తెలియని వాహనం ఢీ... వ్యక్తి మృతి

● స్కూటర్ దగ్ధం





ప్రమాదంలో దగ్ధమైన ద్విచక్రవాహనం, భాస్కరరావు (ఫైల్‌ఫొటో)

ఖాజీపేట/బద్వేలుటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని పత్తూరు బైపాస్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో బుగ్గబోయిన భాస్కర్ (34) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు... గోపవరం మండలం వల్లెవారిపల్లెకు చెందిన భాస్కర్ ప్రస్తుతం బద్వేలు పట్టణంలోని గౌరీ శంకర్‌నగర్ నివాసం ఉంటూ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఖాజీపేట మండలం అగ్రహారంలో తన బంధువులు జాతరకు ఆహ్వానించగా.. భాస్కర్ శనివారం రాత్రి 10 గంటలకు బద్వేలు నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఖాజీపేట సమీపంలో పత్తూరు వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో మంటలు చెలరేగి ద్విచక్ర వాహనం పూర్తిగా దగ్ధమైంది. ప్రధాన రహదారిపై పడి మృతి చెందిన భాస్కర్‌పై పలు వాహనాలు వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజ్జు అయ్యింది. ఆదివారం తెల్లవారు జామున గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలపై ఆరా తీశారు. ద్విచక్రవాహనం నెంబర్‌ప్లేట్ ఆధారంగా బద్వేలు పట్టణ వాసి భాస్కర్‌గా గుర్తించారు. మృతదేహాన్ని కడప రిమ్స్‌కు తరలించారు. మృతునికి భార్య, ఒక కుమారుడు ఉన్నారు. భార్య నాగేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నటు సీఐ మోహన్ తెలిపారు.

యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య



మృతురాలు భాగ్యమ్మ

రామసముద్రం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): బాత్‌రూమ్ క్లీనింగ్‌కు ఉపయోగించే యాసిడ్ తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. మండలంలోని ఆర్.నడింపల్లె పంచాయతీ ఎగువనల్లప్పగారిపల్లెకు చెందిన తుమ్మల వెంకటరమణ కుమార్తె భాగ్యమ్మ(35)కు గుర్రంకొండ మండలంలోని లక్కవారిపల్లెకు చెందిన మల్లికార్జునతో వివాహమైంది. అయితే భార్యాభర్తలిద్దరికీ మనస్పర్థలు రావడంతో ఎనిమిదేళ్ల క్రితం భాగ్యమ్మ పుట్టింటికి వచ్చేసింది. పిల్లలు పుట్టకపోవడం, భర్తను వదిలి రావడం వంటి కారణాలతో ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉండేది. ఈ నేపథ్యంలో శనివారం ఉదయం యాసిడ్ తాగి అపస్మారకస్థితిలో ఉండగా గుర్తించిన కుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మహిళ అదృశ్యం



వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో పఠాన్ వాహిద అనే మహిళ అదృశ్యమైందని సీఐ నరసింహులు తెలిపారు. స్థానిక ఉర్దూ షాదీఖానా సమీపంలో నివశిస్తున్న వాహిద గత నెల 30వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిందని తెలిపారు. అప్పటి నుంచి గ్రామంలో, చుట్టుపక్కల వెతికినా కని పించలేదు. ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలిస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు/ ప్రొద్దుటూరు టౌన్ జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రగతి మార్గంలో పయనించి ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఎస్ఈ సానా వెంకటరవీంద్రవర్మ పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనపరచిన తొగటవీర క్షత్రియ విద్యార్థులకు ఆదివారం తొగటవీర క్షత్రియ కల్యాణ మండపంలో చౌడేశ్వరీదేవి తొగటవీర క్షత్రియ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురష్కారాలను అందజేశారు. ప్రథమ బహుమతి రూ.4 వేలు, ద్వితీయ బహుమతి రూ.3 వేలు, తృతీయ బహుమతి రూ2,500, కన్సోలేషన్ బహుమతులు రూ.1500, మెమోంటో, సర్టిఫికెట్లను అందజేశారు. మొత్తం 115 మంది విద్యార్థులకు రూ.3.25 లక్షలు నగదు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేసిన తొగటవీర క్షత్రియ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు సహకారంతో గత 13 సంవత్సరాలుగా విద్యార్థులను ప్రోత్సహించడానికి ప్రతిభా పురష్కారాలను అందజేస్తున్నామని తెలిపారు. పాలిటెక్నిక్, బీటెక్, మెడిసిన్, ఇతర ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థులు ఆర్థిక ఇబ్బందులు ఉంటే తమను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు పట్టుపోగుల నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి చౌడయ్య, జాయింట్ సెక్రటరి వెంకటనారాయణ, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో...

ప్రొద్దుటూరులో బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం పది, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ మార్కులు సాధించిన బీసీ విద్యార్థులకు ప్రతిభా అవార్డులతో పాటు నగదు పురస్కారం అందజేసే కార్యక్రమం చేపట్టారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహమతి రూ.4 వేలు, కన్సొలేషన్ కింద రూ.3వేలు చొప్పున 76 మంది విద్యార్థులకు రూ.3.20 లక్షలు అందజేశారు. ఈ సభకు బీసీ ప్రజా చైతన్య సమాఖ్య అధ్యక్షుడు బొర్రా రామాంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ ఈ సమాజంలో డబ్బు, పదవి, స్థాయి అనేవి సాధించినప్పుడే అతని మాటలకు విలువ నిస్తారన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు మాట్లాడుతూ మార్కులు అంటే జీవితం కాదన్నారు. సరైన జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకొని సాధించాలన్నారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగింజల చంద్రమౌళి, జిల్లా అధ్యక్షుడు బత్తల లింగమూర్తి, చౌడం జొల్లు కొండయ్య, రిటైర్డ్ విద్యుత్ ఎస్ఈ బత్తల వెంకట సుబ్బయ్య మాట్లాడారు. బీసీ ప్రజా చైతన్య సమాఖ్య ప్రధాన కార్యదర్శి చాబోలు దేవేంద్రుడు, కోశాధికారి సంటెయ్య, కొత్తపల్లె శ్రీను, జీసీ పుల్లయ్య, భాస్కరరావు, దస్తగిరి, మల్లికార్జున, ఆదినారాయణ, బత్తల శ్రీను, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్

ప్రారంభమైన క్యారమ్స్ పోటీలు



కడప స్పోర్ట్స్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప ఇండోర్ స్టేడియంలో కడప క్యారమ్స్ అసోసియేషన్ సెక్రటరీ రాజీ, కోచ్ గణేశ్ బాబు ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి కడప జిల్లా స్థాయి క్యారమ్స్ టోర్నమెంటు ప్రారంభమైంది. ఈనెల 12 వరకు ప్రతిరోజూ ఉదయం 10గం టల నుంచి 12 వరకు క్యారమ్స్ పోటీలు జరగనున్నాయి. మొదటి రోజు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 50 మంది క్యారమ్స్ క్రీడాకారులు హాజరయ్యారు. ఇందులో అండర్-9 బాయ్స్ విభాగంలో గోకుల్, ఎం.మహేశ్వర్ సంయుక్త విజేతలుగా నిలిచారు. రన్నర్‌గా ఎస్.రుషి, అండర్-11 బాలుర విభాగంలో విన్నర్‌గా చరణ్‌సాయి, రన్నర్‌గా అడనాన్, అండర్-14 బాయ్స్ విభాగంలో రంగనాధ్ విన్నర్‌గా, చరణ్ సాయి రన్నర్ నిలిచారు. అలాగే బాలికల విభాగంలో ఎ.షణ్ము కప్రియ విన్నర్‌గా, ధరణి రన్నర్‌గా నిలిచారు. ఇక సీనియర్స్ మెన్ విభాగంలో నాగేంద్ర విన్నర్‌గా, మస్తాన్‌వలి రన్నర్‌గా, మహిళా విభాగంలో శ్రీదేవి విన్నర్‌గా.. రేణుక రన్నర్‌గా నిలిచారు.

ప్రవీణ్‌రెడ్డికి ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జీవీ ప్రవీణ్ కుమార్ రెడ్డికి ప్రభుత్వం ఇద్దరు గన్‌మెన్‌లతో భద్రత కల్పించింది. ప్రొద్దుటూరులోని వైఎస్‌ఆర్ పార్టీ నాయకులతో ప్రవీణ్‌రెడ్డికి ప్రమాదం పొంచి ఉన్నందున ఇంటలిజెన్స్ నివేదిక మేరకు ఇద్దరు గన్‌మెన్‌లను కల్పించారు. ఆమేరకు ఆదివారం గన్‌మెన్‌లు విధుల్లో చేరినట్లు ప్రవీణ్‌రెడ్డి తెలిపారు.

సమగ్ర యాజమాన్యంతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న కేవీకే సమన్వయ అధికారి వీరయ్య

చెన్నూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజనులో వరి సాగు చేసే రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు అవలంబించాలని కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయ అధికారి డాక్టర్ వీరయ్య అన్నారు. ఆదివారం మండలంలోని గుర్రంపాడు, ఉప్పరపల్లె గ్రామాల్లో వికశిత్ కృషి సంకల్ప అబియాన్ కార్యక్రమం జరిగింది. ఇందులో కేవీకే సమన్వయ అధికారి మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై కూలంకుషంగా రైతులతో చర్చించారు. మంచి విత్తనం ఎంపిక, నీటి పారకం, ఎరువుల వాడకం, తెగుళ్ల నివారణ వంటి వాటిపై రైతులకు వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎంఎం ఖురేషీ మాట్లాడుతూ నువ్వులు, వేరుశెనగ పంటల్లో పలు మేలైన రకాలు వాడడం, పాటించాల్సి సమయానుకూల యాజమాన్య పద్ధతులను వివరించారు. ఉద్యాన విశ్వ విద్యాలయం ప్రొఫెసరు డాక్టర్ వెంకటసుబ్బయ్య మామిడిలో కోత దశ అనంతరం చేపట్టాల్సిన పనులపై వివరించారు. వ్యవసాయాధికారి శ్రీదేవి, ఆత్మ బీటీయం వెంకటరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మోటార్‌బైకు ఢీ... మహిళ మృతి



సరోజమ్మ మృతదేహం

ప్రొద్దుటూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణం వైఎంఆర్ కాలనీలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సరోజమ్మ (69) అనే మహిళ మృతి చెందింది. ఈమె ప్రముఖ అవధాన కవి నరాల రామారెడ్డి సతీమణి. ఈమె వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని బైక్ ఢీకొనడంతో గాయపడింది. హుటాహుటిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు.

అల్లుడిని దారుణంగా హత్య చేసిన మామ

● భార్యాభర్తల మధ్య మనస్పర్థలే కారణమా... ● విచారిస్తున్న పోలీసులు

కడప క్రైం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సొంత పిల్లనిచ్చిన మామే అల్లుడి పాలిట యముడయ్యాడు. భార్యాభర్తల మధ్య మనస్పర్థల కారణంగా విసిగిపోయిన మామ చివరికి అల్లున్ని కడతేర్చిన ఘటన కడప నగరం చిన్నచౌకులోని అశోక్ నగర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రవికుమార్‌లు సంఘటనాస్థలానికి చేరుకుని హత్య ఘటనను పరిశీలించారు. సీఐ, స్థానికుల వివరాల మేరకు..

కడప నగరంలోని రామక్రిష్ణనగర్‌లో నివాసం ఉంటున్న సయ్యద్ జుబేదా చిన్నకుమారుడు సయ్యద్ చాంద్‌బాషాకు అశోక్‌నగర్‌లోని మసీదు వీధిలో నివాసం ఉంటున్న షేక్ మహబూబ్‌బాషా కుమార్తె ఆయేషాతో తొమ్మిది సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గు రు కుమారులు ఉన్నారు. చాంద్‌బాషా ఆటో డ్రైవర్‌గా, ఎలక్ట్రిషన్ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. భార్య ఆయేషా కడప నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తుండేది. వివాహమైనప్పటి నుంచి అశోక్ నగర్‌లోనే తన అత్తగారింటి వద్ద ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటుండేవాడు. పెళ్లినాటి నుంచే భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. చిలికి చిలికి గాలివానలా మారి పోలీసుస్టేషన్లలో కేసుల దాకా వెళ్లారు. గత ఆరు నెలల నుంచి ఆయేషా తన పుట్టింట్లోనే ఉంటూ పిల్లలను దగ్గర పెటుకుంది. ఈక్రమంలో పరస్పరం ఘర్షణ పడుతూనే ఉండేవారు. 20 రోజులక్రితం ఆయేషా తండ్రి షేక్ మహబూబ్ బాషా కువైట్ నుంచి వచ్చాడు. ఓసారి తన అల్లుడు చాంద్‌బాషాపై హత్యాయత్నానికి కూడా పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం మధ్యాహ్నం చాంద్ బాషా తన తల్లి జుబేదాకు దావత్ ఉందని చెప్పి వెళ్లాడు. ఆ సమయంలో మామ మహబూబ్ బాషా కూడా కుటుంబ సభ్యులతో కలిసి చాంద్‌బాషాను తమ ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం చేతులు, కాళ్లను తాళ్లతో కట్టేసి మచ్చు కొడవలితో దారుణంగా నరికి హత్య చేశారు. రక్తపు మడుగులో పడి ఉండగా ప్రధాన నిందితుడు షేక్ మహబూబ్‌బాష ఇతర కుటుంబ సభ్యులు అక్కడ నుంచి పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే డీఎస్పీ వెంకటేశ్వర్లు, చిన్నచౌకు సీఐ ఓబులేసు, ఎస్‌ఐ రవికుమార్‌లు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని విచారించారు. మామ, కుటుంబ సభ్యులే తన కుమారుని పొట్టనబెట్టుకున్నారంటూ మృతుని తల్లి జుబేదా రోదించింది. తన కుమారుని హత్య చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది. చిన్నచౌకు సీఐ అన్ని కోణాల్లో విచారి స్తున్నామని, నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



హత్యకు గురైన యువకుడు (ఫైల్)



రోదిస్తున్న మృతుడి బంధువులు

బలవంతపు బదిలీలను ఆపాలి


డీఈవోకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్టీయూఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు

కడప ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయ బదిలీలకు రిక్వెస్ట్ బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులను బలవంతంగా కంపల్సరీ బదిలీ కావాలని విద్యాశాఖ పేర్కొనడం సరికాదని వెంటనే రిక్వెస్ట్ బదిలీ కోరుకున్న ఉపాధ్యాయులను కంపల్సరీ బదిలీ నుంచి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆదివారం డీఈఓ కార్యాలయంలో డీఈఓ షంషుద్దీన్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆవుల శ్రీనివాసులు,వర్కింగ్ ప్రెసిడెంట్ నంద్యాల రాజ గోపాల్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శులు ఆలమూరు ప్రసాద్,అబ్దుల్ సలాం,శ్రీరామ్, అల్లూరి సీతారామయ్య ఉన్నారు.

నేటి నుంచి సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

వల్లూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన పుష్పగిరి క్షేత్రంలో సోమవారం నుంచి 4వతేదీ బుధవారం వరకు సీతారామ చంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠమహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వాహకులు తెలిపారు. ఈ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పుష్పగిరి పీఠాధిపతులు విద్యాశంకరభారతి స్వామివారిచే హనుమ లక్ష్మణ సమేత విగ్రహాలను ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. ప్రతిరోజూ అన్న ప్రసాద కార్యక్రమాలు ఉంటాయని, అలాగే సాయంత్రం ప్రదోశ కాల వేళలో స్వామివారిచే అనుగ్రహ భాష ఉంటుందన్నారు.

పాములూరు జడ్పీహెచ్ఎస్ హెచ్ఎంగా సౌభాగ్యలక్ష్మి

వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పాములూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా సౌభాగ్యలక్ష్మిని నియమించారు. తాళ్లపల్లె జడ్పీ హైస్కూల్లో హెచ్ఎంగా పనిచేస్తున్న ఆమెను పాములూరుకు బదిలీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యబోధన అందిస్తామని ఆమె తెలిపారు.

అందుబాటులోకి రైతు బజార్


వేంపల్లె రైతుబజార్‌లో కూరగాయల స్టాల్స్‌ను పరిశీలిస్తున్న నేతలు

వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేంపల్లెలో ఏడాదికిపైగా నిరుపయోగంగా ఉన్న రైతు బజార్ ఎట్టకేలకు ఉపయోగంలోకి వచ్చింది. ఆదివారం కూరగాయల వ్యాపారులు స్టాల్స్‌లో తమ కూరగాయలను ఉంచుకొని విక్రయించుకున్నారు. సర్పంచు ఆర్.శ్రీను రైతు బజార్ స్టాల్స్‌ను పరిశీలించారు. మే 23వ తేదీన ఆంధ్రజ్యోతిలో నిరుపయోగంగా రైతు బజార్,రూ.1.20కోట్లు నిరుపయోగం అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు దొంతు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పీజీ సెట్ వాయిదా వేయాలి

కడప ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో పీఈటీ, పీజీసెట్‌లో ఎంపీఈడీ రెండు పరీక్షలు జూన్ 9న జరుగుతున్న కారణంగా పీజీ సెట్‌ను వాయిదా వేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. జూన్ 9న డీఎస్సీలో పీఈటీ పరీక్ష ఉండగా అదే రోజు పీజీసెట్‌కు సంబంధించి ఎంపీఈడీ ప్రవేశ పరీక్ష కూడా ఉన్నట్లు ఆయన తెలిపారు. రెండుపరీక్షలు ఒకేరోజు పెట్టడం వల్ల ఉద్యోగార్థులు నష్టపోతారన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ వ్యాయామ కళాశాల అల్యూమి అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రవిశంకర్,కోశాధికారి డాక్టర్ మధుసూదన్‌బాబు, ఉపాధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సెక్రటరీ శంకర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

వ్యర్థాలు తొలగించేదెప్పుడు..?

● లక్షలు ఖర్చు పెట్టి రోడ్డు వేసినా ఫలితం శూన్యం

చెన్నూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మల్లేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రతియేటా పెరుగుతోంది. ఏటా కార్తీక మాఘ మాసాల్లో ఈ ఆలయంలో మంచి ఉత్సవాలు జరుగుతుంటాయి. అయితే పెన్నానది ఒడ్డున వెలసిన ఈ ఆలయానికి శివాలయం వీధి నుంచి రాకపోకలకు ఒకే ఒక్కదారి ఉంది. దీంతో పర్వ దినాల్లో వచ్చే భక్తులకు వెళ్లి వచ్చేందుకు ఒకే దారి ఉండడంతో ఇబ్బందులు పడుతున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పెన్నానది ఒడ్డునుంచి సిమెం టు రోడ్డు ఏర్పాటు చేశారు. సిమెంటు రోడ్డు చెన్నూరు గ్రామ పంచాయతీ పార్కుకు తూర్పు వైపు నుంచి పార్కు ప్రహరీ వెనుకపక్క పెన్నానది ఒడ్డు నుంచి ఆలయం వరకు ఏర్పాట చేశారు. ఇటవలే సిమెంటు రోడ్డునిర్మాణం దాదాపు 90 శాతం మేర పూర్తయింది. కానీ ఆ సిమెంట్ రోడ్డు కిరువైపులా గ్రామ పంచాయతీ నుంచి సేకరించిన వివిధ రకాలచెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర వస్తువు లు కుప్పలుగా పోశారు. ప్రస్తుతం అది డంపింగ్ యార్డుగా ఉంది. ఆలయానికి వచ్చేవారి కోసం రాకపోకలకు ఇబ్బంది కలగకుండా 9లక్షలతో వేసిన సిమెంటు రోడ్డుపై రాకపోకలు జరగాలంటే ఈ వ్యర్థాలు తొలగించాలి. పంచాయతీ అధికారులు దీనిపై దృష్టిపెట్టాలి. కుప్పలు తెప్పలుగా నిలిచి దుర్వాసన వెదజల్లే ఈ వ్యర్థాలన్నీ తొలగించాలి.


చెన్నూరు శివాలయానికి వేసిన రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యర్థాలు

'అపూర్వ' సమ్మేళనం

పులివెందుల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తొండూరు హైస్కూల్లో 10వ తరగతి చదివిన 1995 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఒక్కచోట కలిశారు. ఆదివారం తొండూరు జడ్పీ హైస్కూల్లో ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు ఈ గెట్ టు గెదర్ కార్యక్రమం నిర్వహించారు. 1995లో 10వ తరగతి పూర్తచేసుకున్న విద్యార్థులతో పాటు ఆ బ్యాచ్‌కు సంబంధించి 8,9వ తరగతి విద్యార్థులను కూడా ఆహ్వానించారు. ఉపాధ్యాయులను కూడా ఈ కార్యక్రమానికి ఆహ్వానించారు. ఉదయం 9గంటలకు ప్రధాన గేటు వద్ద పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు శ్రీరామిరెడ్డి రిబ్బన్ కట్ చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రధాన గేటు నుంచి పూర్వపు విద్యార్థులు ఉపాధ్యాయులపై పూలుచల్లుతూ వేదిక వద్దకు ఆహ్వానించారు. 1995 బ్యాచ్‌కు సంబంధించి 125 మంది విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు తలపెట్టారు. ఇందులో దాదాపు 80 మంది హాజరయ్యారు. వీరందరు వారివారి అనుభవాలను ప్రస్తుతం ఏ వృత్తిలో స్థిరపడ్డారు,వారి కుటుంబ వ్యవహారాలు ఒకరినొకరు పంచుకున్నారు.అనంతరం మే 31న పులివెందుల జూనియర్ కళాశాలలో పీడీగా రిటైర్ అయిన ప్రసాదరెడ్డి (పూర్వ విద్యార్థుల పీఈటీ)కి శాలువా కప్పి, పూలమాల వేసి సన్మానించారు. అనంతరం అప్పటి ప్రధానోపాధ్యాయుడు శ్రీరామిరెడ్డి, మ్యాథ్స్ టీచర్ వెంకటరామిరెడ్డి, తెలుగు టీచర్ టి.సి.గంగిరెడ్డి, ప్రస్తుత ప్రధానోపాధ్యాయుడు కె.వి.సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణారెడ్డి, రమణకు శాలువ కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.


తొండూరు హైస్కూల్లో కలిసిన పూర్వవిద్యార్థులు

రేషన్ దుకాణం వద్దే నిత్యావసర సరుకులు

పెండ్లిమర్రి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):ఈ నెల నుంచి రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ రేషన్ దుకాణం వద్దకు వెళ్లి నిత్యావసర సరుకులు తీసుకెళ్లాలని తహసీల్దార్ అనూరాధ తెలిపారు.మండల పరిధిలోని వెల్లటూరు గ్రామంలో ఆదివారం రేషన్ షాపును తహసీల్దార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, అంజలి,పార్టీనాయకులు అన్నమయ్య, చంద్ర ఓబుల్ రెడ్డి,శివారెడ్డితదితరులు పాల్గొన్నారు.

వల్లూరు..: మండల వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో బయోమెట్రిక్ ద్వారా రేషన్ పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు శ్రీవాణి తెలిపారు. ప్రారంభించిన అన్నిరేషన్ దుకణాలను వీఆర్వోలు తనిఖీ చేశారని ఆమె వెల్లడించారు. వల్లూరులో పంపిణీ కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి,వీఆర్వో ఖాజాహుస్సేన్, వీఆర్‌ఏలు పరిశీలించారు.

వేంపల్లె..: రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం మేరకు వేంపల్లెలో రేషన్ డీలర్లు తమ షాపులనుప్రారంభించారు. 1 నుంచి 15వ తేదీ వరకు నిర్దేశిత వేళల్లో రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. ఆ మేరకు రెవిన్యూ అధికారుల సూచనతో డీలర్లు రేషన్ పంపిణీ ప్రారంభించారు.టీడీపీ మండల పరిశీలకుడు అజ్జుగుట్ట రఘునాథరెడ్డి, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జయరామిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీడైరెక్టర్ షబ్బీర్, మండల కన్వీనర్ మునిరెడ్డి ఈ రేషన్‌షాపుప్రారంభోత్సవాల్లో పాల్గొన్నారు.

కడప నాగరాజుపేట..: రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం 27వ డివిజన్ గౌస్‌నగర్‌లో టీడీపీ ముస్లిం మైనార్టీ నాయకులు లయన్ పాటాన్‌ఖాదర్‌బాష, అమానుల్లా షేక్‌లు ప్రారంభించారు.

కడప మారుతీనగర్..: నగర 49వ డివిజన్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ కూకట్లపల్లి చంద్రశేఖర్ ఆదివారం స్థానిక 49వ డివిజను ఆలంఖాన్‌పల్లెకాలనీలో గల పీఏసీఎస్ కార్యాలయంలో ఉన్న రేషన్ షాపులో కార్డుదారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


పెండ్లిమర్రిలో రేషన్ షాపును ప్రారంభిస్తున్న తహసీల్దార్ అనూరాధ

మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం

● తులసిరెడ్డి

వేంపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి మూల్యాంకనంలో కూటమి ప్రభుత్వం వైఫల్యం చెందిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 64వేల మందికిపైగా రీవాల్యూన్, రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేసుకోగా అందులో 11175 మంది మార్కుల్లో తేడా రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. పరీక్షల మూల్యాంకనంపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి విద్యార్థుల భవిష్యత్తు అంధకారం చేస్తుందని దుయ్యబట్టారు. మూల్యాంకనలో జరిగిన తప్పును ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని, తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు. కాగా మాజీ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డికి తులసిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు ఘననివాళులు అర్పించారు.

మానవ మృగాల నుంచి చిన్నారులను పరిరక్షించండి

కడప మారుతీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మనుషుల మధ్య మానవ మృగాలుగా సంచరిస్తూ చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడే వారి భారి నుంచి పిల్లలను పరిరక్షిం చాలని జనసేన పార్టీ జిల్లా నాయకుడు జీవీ రమణ కోరారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జమ్మలమడుగు నియోజక వర్గం కంబాలదిన్నె గ్రామంలో మూడున్నర సంవత్సరాల చిన్నారిపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అత్యాచారం చేయడం బాధాకరమన్నారు. ఈ విషయంగా మా పార్టీ అధినేత ఆదేశాల మేరకు జమ్మలమడుగు కంబాలదిన్నెకు తాము వెళ్లామని, కానీ ఆ గ్రామంలో ఆ బాధిత కుటుంబం నివాసం లేదని తెలిసిందన్నారు. ఈ సమావేశంలో జనసేన పార్టీ నాయకులు తాజ్‌షరీఫ్, షేక్ గౌస్‌బాషా నాయకులు పాల్గొన్నారు.

కష్టపడితేనే ఉద్యోగం సాధ్యం


మాట్లాడుతున్న లక్ష్మీరాజా

కడప ఎడ్యుకేషన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వం ఈనెల 6వ తేదీ నుంచి నిర్వహించే డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించాలంటే మరింత కష్టపడాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెం మహేష్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం యూటీఎఫ్ భవన్‌లో 40రోజజుల పాటు డీఎస్సీ ఉచిత శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ముగింపుసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సహాధ్యక్షుడు వై.రవికుమార్, జిల్లా కార్యదర్శి ఎస్.ఎజాజ్ అహ్మద్, జిల్లా కార్యవర్గ సభ్యుడు జి.గోపినాథ్, యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి.కృష్ణారెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం.ప్రభాకర్, ప్రధానోపాధ్యాయులు సి.వనజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీసాయిదివాకర్ బిర్యానీ సెంటర్ ప్రారంభం



కడప మారుతీనగర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీవో ఆఫీసు సర్కిల్‌లో నూతనంగా శ్రీసాయి దివాకర్ చెన్నూరు ధమ్ బిర్యానీ సెంటరు నాలుగో బ్రాంచ్‌ను ఆదివారం పూజా కార్యక్రమాలు నిర్వహించి హోటల్స్ అధినేత జంబుల దివాకర్‌రెడ్డి ఘనంగా ప్రారంభించారు. ప్రారంభం సందర్భంగా ప్రతి కస్టమరుకు ప్రతి బిర్యానీ కొనుగోలుపై థమ్సఅప్‌తో పాటు వాటర్ బాటిల్ ఉచితంగా అందించారు. చిట్టిముత్యాల ధమ్ బిరియాని తమ ప్రత్యేకత అని తెలిపారు. గత 25 ఏళ్లుగా శ్రీసాయిదివాకర్ హోటల్స్‌ను ఆదరిస్తున్న కడప ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంబీ చికెన్ సెంటరు అధినేత ఖురేషీ ఖాదర్‌బాషా విచ్చేసి అభినందించారు. కార్యక్రమంలో ఖురేషీ నౌషాద్‌బాషా, చిట్టెపు ప్రతాప్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, జనార్ధనరెడ్డి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం కాదు కత్తిపోటు దినంగా నిర్వహించుకోండి

టీడీపీ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు ఈనెల 4వ తేదీన నిర్వహించనున్న వెన్నుపోటు దినం స్థానంలో కత్తిపోటు దినంగా పేరుమార్చి నిర్వహించుకుంటే అర్థవంతంగా ఉంటుందని ప్రజలు కూడా హర్షిస్తారని టీడీపీ నాయకుడు మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. ఆదివారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన వైసీపీనిర్వహిస్తున్న నిరసనదినంపై ఆయన మండిపడ్డారు.టీడీపీని విమర్శించే నైతిక హక్కు వైసీపీ నాయకులకు లేదన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి

కడప ఎర్రముక్కపల్లె, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని డీఎంహెచ్ఓ డాక్టర్ నాగరాజు తెలిపారు. ఆదివారం మలేరియా శాఖ అడిషనల్ డైరెక్టర్ త్యాగరాజు పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

పులివెందుల రూరల్, జూన్ 1: ప్రతిరోజూ యోగా చేయడం వలన మానసిక ఒత్తిడి దూరం అవుతుందని యోగా గురువు వెంకటరామిరెడ్డి అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవంలో భాగంగా ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యోగా శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్, సచివాలయ సిబ్బందితో యోగాసనాలు వేయించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

పులివెందుల రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు సందర్శకులను అలరించాయి. శిల్పారామం పరిపాలన అధికారి విశ్వనాథరెడ్డి పర్యవేక్షణలో పులివెందుల శ్రీరాజకళానిలయం డ్యాన్స్ అకాడమీ చిన్నారులు నృత్య ప్రదర్శనలు ఇచ్చారు.

శిల్పారామంలో సందడే సందడి

కడప కల్చరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఆటవిడుపులో భాగంగా ఆదివారం నగర రిమ్స్ సమీప శిల్పారామం సాంస్కృతిక కళావేదిక మీద సంబంధిత శిల్పారామం అధికారి క్రిష్ణప్రసాద్ పర్యవేక్షణలో ఆదివారం చిన్నారులు వివిధ జానపద, సినిమా, శాస్త్రీయ నృత్యాలకు స్టెప్పులు వేసి అలరించారు.

రేషన్ పంపిణీ సజావుగా జరగాలి



పోరుమామిళ్లలో రేషన్ పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



బీమఠంలో బియ్యం పంపిణీ చేస్తున్న తహసీల్దారు



మైదుకూరులో కొత్తరేషన్‌షాపును ప్రారంభిస్తున్న అధికారులు

జమ్మలమడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం పంపిణీ సజావుగా నిర్వహించాలని, ఎక్కడా అక్రమాలకు తావులేకుండా చూడాలని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ పేర్కొన్నారు.జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని తేరురోడ్డులో రేషన్‌షాపును ఆదివారం ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ రేషన్ షాపు నుంచి దివ్యాంగులకు నడవలేక ఇబ్బంది పడుతున్న వారి ఇంటి వద్దకే రేషన్ పంపిస్తారన్నారు. ప్రతి రేషన్ డీలర్ నిబంధనలు పాటించి పంపిణీ సజావుగా జరగాలని సమస్యలు రాకూడదన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పథకంలో భాగంగా 15వ తేదీ వరకు ప్రతిరేషన్‌షాపు ఓపెన్ చేసి ఉండాలన్నారు. ప్రతి రేషన్‌షాపులో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, నాలుగు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ పంపిణీ చేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంటింటికి రేషన్ పంపిణీ చేస్తామని చెప్పి విఫలమయ్యారన్నారు. అలాంటి దుస్థితిని తొలగించి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంబంధిత మంత్రి నాదేండ్ల మనోహర్ ఎక్కడ ఎలాంటి అక్రమాలు జరుగకుండా చర్యలు తీసుకున్నారన్నారు. తహసీల్దారు శ్రీనివాస రెడ్డి, వారి సిబ్బంది, రేషన్ డీలర్లు టంగుటూరి విశ్వనాథరెడ్డి, ధనుంజయ, పాల్గొన్నారు.

బద్వేలు రూరల్‌లో: చౌక దుకాణాల్లో రేషన్ కార్డుదారులకు బియ్యం, చక్కెర, తదితర వస్తువులన్నింటినీ డీలర్లు సక్రమంగా పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కోరారు. మండల పరిధిలోని రాజుపాలెం గ్రామంలో కూటమి నాయకుడు బొజ్జ రోశన్నతో కలిసి ఆదివారం చౌక దుకాణంలో నిత్యావసర సరుకుల పంపిణీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక రేషన్ పంపిణీ సక్రమంగ జరిగేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని, ప్రతి నెలా 1 నుంచి 15 వరకు ఉదయం 8 నుంచి 12, సాయంత్రం 4 నుంచి 8 వరకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసే విధంగా చర్యలు చేపట్టామన్నారు. దివ్యాంగులు, 65 ఏళ్లు పైబడ్డ వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేసేలాగా ఆదేశాలు జారీ చేయడం జరిగిందని, కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు బసిరెడ్డి రవికుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఎన్ ఫోర్స్‌మెంటు డీటీ శివశంకర్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో: రేషన్‌షాపుల ద్వారా లబ్ధిదారులకు బియ్యం అందేలా చేయాలన్నదే సీఎం చంద్రబాబు లక్ష్యమని బద్వేలు మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. ఆదివారం పోరుమామిళ్ల మేజరు పంచాయతీ బెస్తవీధిలోని 3వషాపును ఆమె ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వం రేషన్‌షాపుల వద్దనే సరుకులు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అనంతరం ఆమె లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ కూటమి నాయకుడు బొజ్జ రోశన్న, తహసీల్దరు చంద్రశేఖ ర్‌రెడ్డి, టీడీపీ నాయకులు చెన్నరాయుడు ఇమాంహుసేన్, మల్లిఖార్జునరెడ్డి, మస్తాన్, సీతా వెంకటసుబ్బయ్య, సత్యరాజ్ ప్రొఫెసరు బాషా పాల్గొన్నారు.

కొండాపురంలో: మండలంలో కొత్తగా 16 రేషన్‌షాపులను ప్రారంభించినట్లు తహసీల్దార్ గురప్ప తెలిపారు. కొత్త డీలర్లు కూడా ఆదివారం నుంచే రేషన్ పంపిణీ ప్రారంభిచినట్లు ఆయన తెలిపారు. 15 వతేదీ వరకు రేషన్ పంపిణీ సక్రమంగా చేయాలని తహసీల్దార్ డీలర్లను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా నిర్ణీత వేళల్లో పంపిణీ చేయాలని కోరారు.

మైదుకూరు రూరల్‌లో : మైదుకూరు మున్సిపాలిటీ, మండలంలోని రేషన్‌షాపులు పండుగ వాతావరణంలో ఆదివారం అధికారులు, పార్టీ నాయకులు ప్రారంభించారు. తెల్లవారుజాము నుంచే రేషన్‌షాపుల వద్ద రేషన్ పంపిణీ చేశారు. 65 ఏళ్ల వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ పంపిణీ చేశారు. రేషన్‌షాపుల వద్ద కార్డుదారులు ఉదయం నుంచి రేషన్ తీసు కొన్నారు.

బ్రహ్మంగారిమఠంలో: బ్రహ్మంగారిమఠం మండలంలో ఆదివారం చౌకధరల దుకాణాల నుంచి నిత్యావసర వస్తువులు గతంలో మాదిరిగానే డీలర్ల చేతుల మీదుగా పంపిణీ చేపట్టారు. ఉదయం 9గంటల నుంచి మండలంలో 16 రేషన్ షాపుల డీలర్ల నుంచి పేదలకు బియ్యాని., కంది పప్పు, చక్కెరను పంపిణీ చేశారు. బి.మఠం ఇన్‌చార్జి తహసీల్దారు రాజనరసింహనరేంద్ర, సోమిరెడ్డిపల్లె పంచాయతీలో నరసన్నపల్లె, తోట్లపల్లె, నరశెట్టిపల్లె గ్రామాల్లోని చౌకదుకాణం తనిఖీ చేశారు. అనంతరం ప్రజలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ తహసీఆల్దారు రాజనరసింహ నరేంద్ర మాట్లాడుతూ వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే గ్రామ రెవెన్యూ అధికారులు వచ్చి నిత్యావసర వస్తువులను అందిస్తారని తెలిపారు. ఈ వీఆర్వో సుధాకర్, డీలర్లు పాల్గొన్నారు.

ఎర్రగుంట్లలో: మున్సిపాలిటీ పరిధిలోని టవర్ బజార్, వినాయక నగర్‌లోని ప్రభుత్వ చౌక దుకాణాలను ఆదివారం జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి భూపేష్‌రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి మంచి జరుగుతుందన్నారు.ప్రజలకు బియ్యం, నిత్యావసరాలు అందించడం జరుగుతుందన్నారు.ఎన్డీయే కూటమి ఇన్‌చార్జి మధుసూదనరెడ్డి, కార్యకర్తలు, డీలర్లు పాల్గొన్నారు.

దువ్వూరులో: దువ్వూరు మండలంలో ఆదివారం రేషన్ షాపుల ద్వారా బియ్యం, ఇతర వస్తువుల పంపిణీ చేశారు చౌక దుకాణాల డీలర్లు నేరుగా వారి షాపుల ద్వారా వినియోగదారులకు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రజా పంపిణీ జరగాలని ప్రభుత్వం ఆదేశించడంతో వారి వారి షాపుల్లోనే ఉండి వాటి పంపిణీకి పూనుకున్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం: ఆర్డీవో



జమ్మలమడుగులో యోగా చేస్తున్న ఆర్డీవో సాయిశ్రీ, కమిషనర్, సిబ్బంది

జమ్మలమడుగు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు యోగా చేసుకోవడం వలన సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని మానసిక సమస్యలు, అనారోగ్యం దూరమవుతాయని జమ్మలమడుగు ఆర్డీవో సాయిశ్రీ సూచించారు. ఆదివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో ముద్దనూరు రోడ్డులోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రాంగణంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్డీవో సాయిశ్రీ హజరై సూచనలు ఇచ్చారు. తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



యోగా చేస్తున్న మున్సిపల్ కమిషనర్, ప్రజలు

బద్వేలుటౌన్‌లో: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిదిలోని పోరుమామిళ్లరోడ్డు ప్రధాన రహదారిపై యోగా గురువు అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో యోగా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా యోగాసనాల ద్వారా మనకు ఎలాంటి ప్రయోజనాలు చేకూరుతాయి, సూర్యనమస్కారాలు, ప్రణాయామాలు తదితర యోగాసనాలను ప్రజలతో చేయించారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగాచేసి ఆరోగ్యంగా ఉండాలని కమిషనర్ నరసింహారెడ్డి పేర్కొన్నారు.

వడ్డెర వృత్తిదారులు సమైక్యంగా పోరాడాలి

బద్వేలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) వడ్డెర సంఘం వృత్తిదారులు ఐక్యంగా పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర కన్వీనర్ గుంజి దయాకర్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అందించి వృత్తిదారుల సంక్షేమానికి పాటుపడాలని కోరారు. జూన్ నెల చివరివారంలో నెల్లూరులో జరిగే వడ్డెర వృత్తిదారుల సంఘ రాష్ట్ర మహాసభలలో పాల్గొని జయప్రదం చేయా లని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు.కమిటీ కన్వీనర్‌గా బత్తల గంగయ్య, కోకన్వీనర్లుగా సుబ్బయ్య, వెంకటేష్, సభ్యులు సుబ్బమ్మ, సుబ్బరాయుడులను ఎన్నుకున్నారు.

కల్లుట్లలో ఘనంగా గంగమ్మ జాతర



గంగమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి

మైలవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కల్లుట్ల గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గంగమ్మ జాతరను గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని ప్రత్యేక విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో గ్రామంలో సందడి నెలకొంది. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

ఖాజీపేటలో భక్తిశ్రద్ధలతో బోనాలు



ఖాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుడుమలదిన్నె, అగ్రహారం గ్రామాల్లో ఆదివారం అంకాలమ్మతల్లికి భక్తులు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. విగ్రహ ప్రతిష్ట జరిగి 41 రోజుల క్రితం సందర్భంగా రెండు గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బోనాలు సమర్పించడం వలన గ్రామంలో పాడిపంటలు బాగా పండి ప్రజలను చల్లంగా చూస్తుందని భక్తుల నమ్మకం

వైభవంగా పల్నాడు అంకాలమ్మ తల్లి ఉత్సవాలు

బి.కోడూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాజుపాలెంలో వెలసిన పురాతన పల్నాడు అంకాలమ్మ తల్లి 9 రోజుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా సోమవారం కోలాటం పోటీలు, గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ.50వేలు, ద్వితీయ బహుమతిగా రూ.30వేలు, అలాగే 4న ఆర్కెస్ట్రా పాటకచేరి, 5వతేదీన కులుకు భజన పోటీలు అందులో గెలుపొందినవారిని మొదటి బహుమతి 75వేలు, ద్వితీయ 50వేలు 6వతేదీన బండలాగుడు పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ. లక్ష, రెండో బహుమతి రూ.80వేలు, మూడోబహుమతి 60వేలు, నాలుగో బహుమతి రూ.40వేలుగా ఇవ్వనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. ముఖ్యంగా 6న ఉత్కంఠ భరితంగా సాగే కంపకల్లి రణం కొలువులు ముళ్లకంపపై భక్తులు దొర్లుట జరుగుతుంది. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

భగవద్గీతతో మానవ జన్మకు ముక్తి మార్గం

ప్రొద్దుటూరు , జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : మానవ జన్మకు ముక్తి మార్గం భగవద్గీత పారాయణంతో సాధ్యమని మాతృశ్రీ రత్నమ్మ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వేదాంత లక్ష్మణాచార్యుల ఆశ్రమం లో చిన్నారులకు 5, 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు మూడు విభాగాలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలను విద్యార్థులు అద్భుతంగా పాడారు అని నిర్వాహకులు ప్రసంశించారు. కార్యక్రమంలో సాధుగోపాల కృష్ణ జింకా సుబ్రమణ్యం, రాధ, మధుసూదనరెడ్డి, కృష్ణ చైతన్య స్వామి, ఎప్రభాకర్ శీపాల శివ, శివారెడ్డెయ్య, రమణారెడ్డి, జింకా చెంద్రాయుడు, ఇంద్రకుమార్, పాల్గొన్నారు.

'లోకేశ్‌ను జగన్ విమర్శించడం తగదు'

చాపాడు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించడం తగదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పిచ్చపాటి మునిశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ ఏడాది పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో రీ వెరిఫికేషన్ 0.25 శాతం మాత్రమే చేయడం జరిగిందన్నారు. జగన్ పాలనలో 2022లో రీ వెరిఫికేషన్ 20 శాతం, 2023లో 18 శాతం, 2024లో 17 శాతం చేయడం జరిగిందన్నారు. ఈ విషయాలను జగన్ తెలుసుకోవాలన్నారు. మహానాడు విజయవంతం కావడంతో జగన్‌కు దిక్కుతోచక ఇలా మాట్లాడడం కడుపుమంట రేగడం మంచిదికాదన్నారు.

వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలి

జమ్మలమడుగు/బద్వేలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయాలని బద్వే లులో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డిలు పిలుపునిచ్చారు. ఆ మేరకు వెన్నుపోటు దినం పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. కాగా జమ్మలమడుగు వైసీపీ కార్యాలయంలో జమ్మలమడుగు, పెద్దముడియం మండలాలకు చెందిన వైసీపీ కార్యకర్తలకు సమావేశంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ 4వ తేదీ వైసీపీ అధిష్టానం వెన్నుపోటు దినంగా ప్రకటించినట్లు తెలిపారు. గిరిధర్‌రెడ్డి, రమణారెడ్డి, సుధీర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో అధికారుల సూచనలు పాటించండి

ఖాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పంటలు సాగు చేసేటప్పుడు రైతన్నలు అధికారుల సూచనలు పాటించాలని ఐఐఓఆర్, ఐకేర్ హైదరాబాబు శాస్త్రవేత్త టి.బసవరాజు అన్నారు. ఆదివారం మండల పరిధిలోని అప్పనపల్లె, నాగసానిపల్లె రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయాధికారి నాగార్జున ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కేవీకే మేనేజర్ మమత, ఆత్మా బీటీఎం చెన్నకేశవులు, అగ్రికల్చరల్, ఆర్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

బకాయిలపై దృష్టి సారించిన విద్యుత్ శాఖ

దువ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ పరిధిలోని వినియోగదారులు చెల్లించాల్సిన పాత బకాయిలపై ఆశాఖ అధికారులు దృష్టి సారించారు. సాధారణంగా వ్యవసాయానికి నెలకు రూ.30 చెల్లించాల్సి ఉంటుందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. దువ్వూరు తోపాటు మైదుకూరు, చాపాడు, ఖాజీపేట, వనిపెంట పరిధిలో ప్రత్యేక టీంలను నియమించి వాటి వసూళ్లకు ఈనెల 3వ తేదీ నుంచి తిరగనున్నట్లు ఆశాఖ అధికారులు వెల్లడించారు.

బద్వేలులో వాహనాల తనిఖీ

బద్వేలుటౌన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) :పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఆదివారం అర్బన్‌సీఐ రాజగోపాల్‌రెడ్డి తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్‌లు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యూనిఫాం ధరించి ఆటోలను నడపాలన్నారు. రికార్డుల్లేకుంటే జరిమానాలు తప్పవన్నారు. హెడ్ కానిస్టేబుల్ వెంకటసుబ్బయ్య, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.